క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: ఉమ్మడి జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూలవిరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజారులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు.

కంది సాగుపై పరిశోధనకు డాక్టరేట్



జమేదార్ హర్షవర్ధన్‌రాయుడు

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన జమేదార్ హర్షవర్ధన్ రాయుడుకు ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తల్లిదండ్రులు మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, ధనలక్ష్మి ఆదివారం తెలిపారు. డాక్టరేట్ పొందిన హర్షవర్ధన్‌రాయుడు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో కంది పంటలో తక్కువ పంటకాలంలో ఎక్కువ దిగుబడి సాధించేందుకు చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ దక్కిందన్నారు. ప్రస్తుతం హైదరాబాదులోని ఇక్రిసాట్‌లో వరి, నూనె గింజలపై పరిశోధనలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మద్దికెర వాసికి డాక్టరేట్ దక్కడంపై పలువురు అభినందనలు తెలిపారు.

95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

చిప్పగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించే కార్యక్రమం మూడవ రోజు ఆదివారం కొనసాగింది.ఈ సందర్భంగా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి వేలిముద్రలు నమోదు చేసుకుని పింఛన్ సొమ్ము అందించారు. మండలంలో పింఛన్ పంపిణీ కార్యక్రమం 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ బరెన్ సాహెబ్ తెలిపారు.

ఘనంగా ఉరుసు



కారుమంచిలో నేముటూరు ఉసేన్ వలి తాత సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో ఆదివారం నేముటూరు ఉసేన్ వలి తాత ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తాత సమాధిని భక్తులు దర్శించుకున్నారు. సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ చంద్రకళ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



కుందనగుర్తిలో భగవద్గీత గ్రంథం పంపిణీ

చిప్పగిరి: మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కుందనగుర్తి గ్రామంలో భగవద్గీతపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు కాలనీలు పర్యటించి భగవద్గీత సూక్తులను వివరించారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రచారకులు ధనుంజయ్య, దానప్ప, మల్లికార్జున, రాజు, రాధ, చైతన్య, త్రివేణి, రాజేశ్వరి, పుష్ప, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

5న సురక్ష వైద్య శిబిరం

తుగ్గలి: మండల పరిధిలోని జీఎర్రగుడి గ్రామంలో ఈ నెల 5వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభవుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రిటైర్డ్ ఎంఈఓకు సన్మానం

పత్తికొండటౌన్: పత్తికొండ మండల విద్యాధికారి ఉల్లిగడ్డల మస్తాన్‌వలి ఫిబ్రవరి 29న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పత్తికొండలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ మస్తాన్‌వలిని ఎంపీపీ నారాయణదాసు, మండలంలోని ఉపాధ్యాయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముదీపిక, ఎంఈఓ–2 గాజుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



ముగతిలో ఇటుక బట్టీ కార్మికుల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు



గోనెగండ్లలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ రంగరవళి



పత్తికొండలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ నారాయణదాసు



కృష్ణగిరిలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్



మద్దికెర పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ

రెండు చుక్కలతో వైకల్యం దూరం

ఎమ్మిగనూరుటౌన్: వైకల్యం నివారించేందుకు ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు శివన్ననగర్ తదితర ప్రాంతాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలియో వ్యాధి ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి నశించి కాళ్లు, చేతులు వంకరపోవడం కొన్ని కేసుల్లో మెదడుకు కూడా ఈవ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. దీని నివారణకు ప్రభుత్వం నిర్వహించే పల్స్ పోలియో చుక్కలను పిల్లలకు వేయించాలని సూచించారు. నాయకులు బుట్టా నీలకంఠ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పలు వార్డు సచివాలయాల్లో కౌన్సిలర్లు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థినులు పల్స్‌పోలియో కేంద్రాల వద్ద సేవా కార్యక్రమాలు చేపట్టారు.

నందవరం: ఐదేళ్లలోపు చిన్నారుల బంగారు భవిష్యత్‌కు రెండు పోలియో చుక్కలు వేశామని జిల్లా మలేరియా అధికారి నూకరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోనూ, ముగతిలోని ఇటుక బట్టీల వద్ద కార్మికుల పిల్లలకు డాక్టర్ శ్రీలేఖ, మలేరియా అధికారి పోలియో చుక్కలు వేశారు. అలాగే అన్ని గ్రామాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, గ్రామ వలంటీర్లు నిర్వహించారు. డాక్టర్ శ్రీలేఖ మాట్లాడుతూ.. మండలంలో 7,189 మంది చిన్నారులకుగానూ తొలిరోజు 6,030 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. సీహెచ్‌ఓ బలరాముడు, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: పోలియోరహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ చంద్రకాంత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 8,590 మందికి గాను తొలిరోజు 8055 మందికి (94 శాతం) పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తామని చెప్పారు.

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణం, మండలంలో చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం అయినట్లు వైద్యాధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలో 0–5 ఏళ్లలోపు చిన్నారులు 7798 మంది ఉండగా తొలిరోజు 7685 మంది (98 శాతం) చిన్నారులకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేసినట్లు ఆయన తెలిపారు. పత్తికొండ ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ నారాయణదాసు పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. మొత్తం 290 కేంద్రాలు, 95 మొబైల్ టీంల ద్వారా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు.

కృష్ణగిరి: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 98.72 శాతం మందికి చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయన స్వయంగా కొందరు చిన్నారులకు చుక్కల మందు వేశారు. మొత్తం 5168 చిన్నారులకుగాను 5071 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మరో రెండ్రోజుల స్పెషల్ డ్రైవ్‌లో వంద శాతం మందికి చుక్కలు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని గోవర్ధనగిరి, రామళ్లకోట పీహెచ్‌సీల పరిధిలోని 18 సచివాలయాలు, 41 గ్రామాలలో 59 బూత్‌లు ఏర్పాటు చేసి ఆదివారం నాటి పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 6147 మంది చిన్నారులకుగాను తొలిరోజు 5872 మందికి చుక్కల మందు వేసి 95.52 శాతం నమోదు చేసినట్లు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు భవనతేజ, నవీన్‌కుమార్ తెలిపారు. వెల్దుర్తిలోని పలు కేంద్రాలలో జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న పలువురికి పోలియో చుక్కలు వేశారు.

మద్దికెర: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్ అన్నారు. ఆదివారం మద్దికెర ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేశారు. వారు మాట్లాడుతూ మండలంలో 3925 మంది చిన్నారులు ఉండగా 97 శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ రామకృష్ణ, సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుగ్గలి: రెండు చుక్కలతో వైకల్యాన్ని అరికట్టవచ్చని పగిడిరాయి పీహెచ్‌సీ వైద్యులు హరిత, మినాజ్‌పాషా, తుగ్గలి పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్‌కుమార్, ప్రణీత అన్నారు. ఆదివారం ఆయా పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వారు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ భాస్కర్ శభాష్‌పురంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆలూరు:చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి అన్నారు. ఆలూరులోని సచివాలయం–2 ఆవరణలో వైద్యాధికారుల సమక్షంలో కోయనగర్‌కాలనీకి చెందిన 0–5 వయస్సులోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కల ముందు వేశారు. ఎంపీపీ రంగమ్మ, సింగిల్ విండో చైర్‌పర్సన్ హనుమంతమ్మ, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: మండలంలో హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ డాక్టర్లు బిందుమాధవి, న్యూటన్, రాధ, రాధమ్మ ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. మండలంలో 0–5 ఏళ్ల చిన్నారులు 9 వేల మంది ఉండగా తొలిరోజు 50 శాతం మేర పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్లు తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఆరోగ్య సిబ్బందికి ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు.

ఆస్పరి:మండలంలోని ములుగుందం గ్రామంలో డాక్టర్ రఘురామిరెడ్డి పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ మండలంలో 95 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. మొత్తం 45 కేంద్రాలో 6952 మందిపిల్లలకు గాను 6404 మందికి చుక్కల మందు వేసినట్లుతెలిపారు.225మంది వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సమన్వయకర్త బుట్టా రేణుక

చిప్పగిరి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రద్దీ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందువేశారు. మెడికల్ ఆఫీసర్‌లు షేక్ అఫ్రోజ్‌జాన్, పార్వతి, కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలోని నిట్రవటి గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు లింగన్న, హాలహర్వి‌లో ఎంపీపీ నెట్టికంఠమ్మ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ గోపాల్, వైద్యులు తిమ్మన్న, గంగాధర, తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

దేవనకొండ: మండలంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి భాస్కర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వంద శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది జయలక్ష్మి, సాయిబాబా, మాదమ్మ, అరుణ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప



ఆలూరులో చిన్నారికి పోలియో చుక్కల మందు వేస్తున్న విరూపాక్షి



దేవనకొండలో పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి భాస్కర్



ములుగుందంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ రఘురామిరెడ్డి



చిప్పగిరి పోలియో చుక్కలు వేస్తున్న మెడికల్ ఆఫీసర్ షేక్ అఫ్రోజ్ జాన్

సంక్షేమ సారథికి పట్టం కడదాం

నందవరం: పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక పిలుపునిచ్చారు. ఆమె ఆదివారం మండల పరిధిలోని జొహరాపురంలో ఓ వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. ఆమెకు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సీఎం వైఎస్ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైఎస్సార్ ఆసరా, చేయూత, బ్యాంకు రుణాలు, చేదోడు, సున్నా వడ్డీ తదితర పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నాడు– నేడు పథకంతో ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, నాయకులు శివనీలకంఠప్ప, ప్రతూల్, రంగారెడ్డి, సోమన్న, రాముడు, నరసింహులు, సూర్యప్రకాష్ రెడ్డి, హనుమంతు, ప్రహ్లాదరెడ్డి, థామస్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



సమన్వయకర్త బుట్టా రేణుకతో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేద్దాం

హొళగుంద: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు, వైఎస్ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు కృషి చేద్దామని పార్టీ నియోజకవర్గ నాయకుడు శ్రీరాములు, జేసీఎస్ కన్వీనర్ మల్లికార్జున, మండల కన్వీనర్ షఫీవుల్లా పిలుపునిచ్చారు. ఆదివారం హొళగుందలో 'మేము సిద్ధం.. నా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ప్రజలకు ఏ నాయకుడు చేయని మేలును సీఎం జగనన్న చేశాడన్నారు. ప్రతి ఇంటికీ ఏదో రూపంలో లబ్ధి జరిగిందని వివరించారు. టీడీపీ చంద్రబాబు పాలన, వైఎస్సార్‌సీపీ జగనన్న పాలన మధ్య ఎంత తేడా ఉందో ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. స్కూళ్లు, హాస్పిటళ్లు, గ్రామ/వార్డు సచివాలయాలు, సీసీ రోడ్లు, పల్లె రోడ్లు ఇలా జరిగిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు మరోమారు గుర్తు చేయాలన్నారు. నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, మల్లయ్య, హనుమప్ప, మజ్జిగ సిద్దయ్య, రమేశ్, మోహన్‌రాజు, రంగప్ప, రామకృష్ణ, బసవ, దుర్గాప్రసాద్, శేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



హొళగుందలో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

ఆస్పరి: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరగాలన్నా, పేదింటి బిడ్డ భవిష్యత్‌కు బంగారు బాట పడాలన్నా మళ్లీ వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని జేసీఎస్ మండల కన్వీనర్ బసవరాజు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి సూచన మేరకు ఆదివారం 'మేము సిద్ధం– మా పోలింగ్ బూత్ సిద్ధం' కార్య క్రమం మండలంలోని ములుగుందం, బనవనూరు, పలకూరబండ, చెన్నంపల్లి, వెంగళాయిదొడ్డి, కారుమంచి, పుప్పాలదొడ్డి, కైరుప్పల గ్రామాలలో నిర్వహించారు. ఆయా గ్రామాలలో 15 పోలింగ్ బూత్‌లకు కన్వీనర్లను నియమించారు. ఈ సందర్భంగా జేసీఎస్ మండల కన్వీనర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పథకాలు, అభివృద్ధి గురించి గ్రామాల్లోని ప్రజలకు వివరించి ఓటును అభ్యర్థించాలన్నారు. అందరూ కలసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దయ్య, కుందనగుర్తి నాగప్ప, ప్రభాకర్‌రెడ్డి, చిన్నాయప్ప, వెంకటేష్, ప్రకాష్, పెద్దరెడ్డి, రాజన్నగౌడ్, కౌలుట్లయ్య, లక్ష్మన్న, వీరభద్రి తదితరులు పాల్గొన్నారు.



ములుగుందం పోలింగ్ బూత్ కన్వీనర్ల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

ఆలూరు: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారంలో ఆలూరులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ రంగమ్మ, నాయకులు ఈరన్న, వీరేష్, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ముస్లింల అభ్యున్నతి



కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న సిరాజ్‌ఉర్ రహిమాన్

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింలు తమ పిల్లలను బాగా చదివిస్తే అన్ని రంగాల్లో రాణించవచ్చని ముస్లిం ప్రబోధకుడు బ్రదర్ సిరాజ్‌ఉర్ రహిమాన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో 'ముస్లింల పురోగతి ఎప్పుడు? ఎలా?' అన్న అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆయన్ను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు దైవమార్గంలో పయనించాలని, అలాగే విద్య, సామాజిక, రాజకీయంగా అభ్యున్నతి సాధించాలని సూచించారు. ముస్లింలలో ఐక్యత ముఖ్యమని అప్పుడే తమ హక్కుల సాధన సులభమవుతుందని చెప్పారు. రాష్ట్రంలో కనీసం 14 మంది ముస్లింలు ఎమ్మెల్యేలుగా చట్టసభలకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఖురాన్ సూక్తులను వివరించారు.

ముస్లింలకు రిజర్వేషన్లు వైఎస్సార్ చలువే

అన్ని విధాలుగా వెనుకబడిన ముస్లింలకు దివంగత నేత వైఎస్సార్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించి ముస్లిం సామాజానికి చేయూతనందించారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ ముస్లింలతో పాటు అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ అధిక శాతం ఎమ్మెల్యే సీట్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. విద్యకు తమ ప్రభుత్వం, తాను కూడా ప్రోత్సాహం అందిస్తున్నట్లు వివరించారు. విద్య ఉంటే దేన్నయినా సాధించవచ్చన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్‌తో పాటు ముస్లిం పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

370 కి.మీ వెళ్లి పింఛన్ పంపిణీ



చిత్తూరు జిల్లాలో ఉన్న దివ్యాంగుడు జగన్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ప్రేమరాజ్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామానికి చెందిన వలంటీర్ ప్రేమరాజ్ 370 కిలోమీటర్ల దూరం వెళ్లి పింఛన్ పంపిణీ చేసి శభాష్ అనిపించుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన నాగేష్ చిత్తూర్ జిల్లా మొలకలచెరువుకు వలస వెళ్లాడు. తనతో పాటు దివ్యాంగుడైన కుమారుడు జగన్‌ను తీసుకెళ్లాడు. బాలుడికి పింఛన్ మంజూరైందని వచ్చి తీసుకోవాలని అతని తండ్రికి ఫోన్ చేయగా ఇప్పుడున్న పరిస్థితుల్లో రాలేమని, ఆరోగ్యం కూడా బాగాలేదని బదులిచ్చారు. వారి ఆర్థిక పరిస్థితి తెలిసిన వలంటీర్ ప్రేమరాజు 370 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారి వద్దకే వెళ్లి ఆదివారం సాయంత్రం పింఛన్ సొమ్ము అందజేయడంతో తండ్రి నాగేష్ ఎంతో సంతోషపడ్డాడు. రానూపోను 740 కి.మీ ప్రయాణం చేసి పింఛన్ అందించానని, అంతదూరం వెళ్లినా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి పింఛన్ అందించడం సంతోషంగా ఉందని వలంటీర్ ప్రేమరాజ్ చెప్పారు.

పార్టీ గెలుపులో యువత పాత్ర కీలకం



సమన్వయకర్త విరూపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన దేవనకొండ యువకులు

ఆలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ గెలుపులో యువత పాత్ర కీలకమని ఆలూరు సమన్వయకర్త విరూపాక్షి అన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని కోయనగర్, ఎస్సీ కాలనీలలో కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. మాటకు కట్టుబడే జగనన్నకు, అవినీతిని నమ్ముకున్న చంద్రబాబు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సంక్షేమ పాలన వైపు నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం దేవకొండ మండలం తెర్నెకల్, గుమ్మిరాళ్ల, కరివేముల, కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన వంద మంది యువకులు గుమ్మిరాళ్ల రామాంజినేయులు, పులి నరేష్, కరివేముల శ్రీనివాసులు, ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. కోయనగర్‌కు చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ మద్దిలేటి వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే హాలహర్వి మండలం బల్లూరులో టీడీపీకి చెందిన 30 కుటుంబాలు రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ రంగమ్మ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, ఎంపీటీసీలు దేవరాజు, షేక్షావలి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

నందవరం: గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో తాగునీటి కోసం నూతన పైపులైన్ నిర్మాణ పనులను సర్పంచ్ వీరస్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక ఆదేశాల మేరకు ఎంపీపీ లక్ష్మీదేవమ్మ సహకారంతో గ్రామంలో తాగునీటి పైపులైన్ నిర్మాణం చేపట్టామన్నారు. ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో తుంగభద్ర నదిలో బోర్లను తవ్వించామన్నారు. ఆ బోర్ల ద్వారా ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసేందుకు నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామంలోని ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇచ్చి ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. అలాగే మహా శివరాత్రి ఉత్సవాల భాగంగా గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు సరఫరా చేస్తామని వివరించారు. గ్రామంలో వాటర్ ట్యాంకు నుంచి అన్ని వీధులకు నీటి సరఫరా చేస్తామని తెలిపారు.



గురజాలలో పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు